
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 14 నవంబరు 2024



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) సారంగాపూర్ మండలం బట్టపల్లి గ్రామానికి చెందిన కె. రమాదేవి అనే మహిళ వెన్నెముఖ సమస్యతో బాధపడుతుండగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రెండు లక్షల యాభైవేల రూపాయల ఎల్‌వోసీని రమాదేవి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. రమాదేవి ఆరోగ్య సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు బాధితురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ విప్ అడ్లూరిని కలిసిన డీఎంహెచ్‌వో

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను బుధవారం జగిత్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ప్రమోద్‌కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు ఉదయం ప్రభుత్వ విప్‌ను తన క్యాంపు కార్యాలయంలో వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారి వెంట జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్, ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య-లక్ష్మణ్ పాల్గొన్నారు..

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జగిత్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎ.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ గురువారం నుంచి 20వ తేదీ బుధవారం వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవులు

జగిత్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సెలవు ఉండగా, మార్కెట్ యార్డులో ధాన్యం నిల్వలు పేరుకుపోయినందున, ధాన్యం పోయడానికి స్థలం లేనందున శని, ఆదివారాలు కూడా మార్కెట్ యార్డులో కొనుగోలు జరుగవని తిరిగి సోమవారం యథావిధిగా మార్కెట్ ప్రారంభం అవుతుందని, గమనించాలని ఆయన కోరారు.



- గ్రూప్-3, టెట్, డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు
- గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లలోనూ కిటకిట
- ఈనెల 17,18వ తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు
- ఆన్‌లైన్‌లో విడుదల అయిన హాల్ టిక్కెట్లు
- జిల్లాలో పోటీ పడుతున్న సుమారు 30 వేల మంది
- ఈనెల 20వ తేదీ వరకు టెట్ దరఖాస్తులు

సర్కారు కొలువే లక్ష్యంగా

TARGET GOVT JOB

పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూ లేకుండా, కేవలం మార్కులను ఆధారంగా సర్కారు కొలువు కొట్టనున్నారు.

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సర్కారు కొలువు కొట్టాలనే పట్టుదలతో రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. జిల్లా గ్రంథాలయంతో పాటు ప్రైవేట్, ఆన్‌లైన్ కోచింగ్ సెంటర్ల ద్వారా పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ఏళ్ల తరబడి ప్రిపరేషన్‌కే పరిమిత మైన యువత..ఇటీవల డీఎస్సీతో కొంత ఉపశమనం పొందగా...వరుస నోటిఫికేషన్లతో రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారు. గ్రూప్-3 పరీక్షకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరో వైపు టెట్ నిర్వహణకు దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. నీట్ పరీక్షకు సైతం పలువురు యువతీ యువకులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల మంది నిరుద్యోగులు కొలువలను సాధించడమే లక్ష్యంగా ప్రిపేర్ అవుతున్నారు.

రెండు రోజుల పాటు గ్రూప్-3 పరీక్షలు..

జిల్లాలో గ్రూప్-3 పరీక్ష ఈ నెల 17, 18వ తేదీల్లో రెండు రోజుల పాటు జరుగనుంది. నవంబర్ 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్ విడుదల చేశారు. ఈ నోటిఫి కేషన్ ద్వారా మొత్తంగా 1,388 గ్రూప్-3 పోస్టు లను భర్తీ చేయనుండగా, ఇందులో అదనంగా 14 పోస్టు లను పెంచింది. వీటి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5,36,477 మంది దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లా నుంచి సుమారు 10,656 మంది పరీక్షకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 34 సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. 17వ తేదీన రెండు 18న ఒక పేపర్ మూడు పరీక్షలకు గాను ఒక్కో పేపర్‌కు 150 చొప్పున 450 మార్కులకు విద్యార్థి మూడు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పరీక్షకు రెండున్నర గంటల సమయం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారిగా..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి గ్రూప్-3 పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రూప్-3 పరీక్షలో ముఖ్యంగా ఎకానమీ పేపర్, కరెంట్ అఫైర్స్ అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానమైన అంశాలకు సంబంధించి సిలబస్ ప్రకారం రివైజ్ చేయాలని, ముఖ్యంగా పాలిటిక్స్, ఎకానమీ, చరిత్ర, జనరల్ సైన్స్ వంటి అంశాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. గత పేపర్లను, మోడల్స్‌ను పరిశీలించాలని, ఇవి ప్రశ్నల శైలి, ముఖ్యమైన అంశాలపై క్లారిటీ ఇస్తాయని, ముఖ్యమైన పాయింట్స్, డేట్స్, పేర్ల గురించి చిన్న నోట్స్ రాసుకోవాలని అంటున్నారు.

(తరువాయి 8లో..)

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి జితేంద్రప్రసాద్



వెల్దుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మార్కెటింగ్ అధికారి

జగిత్యాలరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి జితేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి, నర్సింగాపూర్, అంతర్గాం, అర్బన్ మండలం ధరూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఏపీఎం గంగాధర్, జిల్లామార్కెటింగ్ వింగ్ సీసీకే సత్యనారాయణ, ఏఈవో రమ్య, సీసీలు మరియా, విద్యాసాగర్, వీవోఏలు పాల్గొన్నారు.

గ్రూప్- 3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో టీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతరులు

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్-3 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 17, 18వ తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొలుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్

8లో



కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ ఇబ్బందులే

8లో

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

సీఎంను విమర్శించడం బీఆర్ఎస్‌కు తగదు

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల అర్బన్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) రైతులకు రుణ మాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం బీఆర్ఎస్ నాయకులకు తగదని జగిత్యాల మున్సిపాలిటీ చైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం జగిత్యాలలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రైతులకు, ప్రజలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. జగిత్యాలలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడిన మాటలు కోటలు దాటి ప్రజలను మభ్యపెట్టే రీతిలో ఉన్నాయన్నారు. జగిత్యాల అభివృద్ధి గురించి మాట్లాడిన బిఆర్ఎస్ నాయకులు జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమన్వయంతో సమగ్ర సర్వేకు పూనుకున్న ముఖ్యమంత్రిని విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



రవీంద్ర ప్లేస్కూల్లో జరిగిన బాలల దినోత్సవ వేడుకలు

జగిత్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని రవీంద్ర ప్లే స్కూల్లో బుధవారం జరిగిన బాలల దినోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. ముందస్తుగా నిర్వహించిన ఈ వేడుకల సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, దేవతలు, పక్షులు, కార్టూన్ పక్షులు, జంతువుల వంటి వివిధ వేషధారణలు, చిన్నారులు రైతు ప్రాముఖ్యత, అమ్మ, నాన్నల గొప్పతనం గూర్చి వేసిన నాటికలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుమన్ రావు, కిషన్, శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, కె. సుమన్ రావు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో బుధవారం ముందస్తు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా భారత మాజీ ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ గురించి విద్యా ర్థులకు వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులై దేశ భవిష్యత్‌ను భుజాల మీద మో యడానికి సిద్ధంగా ఉన్నారని, పిల్లల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్స్ సొసైటీని ప్రారంభించారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు మచ్చ లలితవిద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, షారు, సంజన, శృతి, రజిత, ఇందూజ, పాల్గొన్నారు.

'15 ఇళ్ల నిబంధన వెంటనే నిలిపివేయాలి'

జగిత్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో సమగ్ర కులగణన సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు రోజుకు 15 ఇండ్లు సర్వే చేయాలనే నిబంధన వెంటనే నిలిపివేసి, సర్వే చేయడానికి గడువు పొడగించాలని పీఆర్టీయూటీయూఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోయినిపెల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్వేలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామం తర్వాత ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న తరుణంలో ఒక్కో ఇంటిలో దాదాపు 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతున్నదని ఈ పరిస్థితుల్లో రోజు 15 ఇండ్లు సర్వే చేయడం అసాధ్యం అన్నారు.

కోటేశ్వర స్వామికి ఏకాదశి పూజలు

వెల్గటూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటిలింగాల గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు కోరిన కోరికలు తీరాలని మొక్కుకొని గోదావరిలో వదిలారు. శ్రీ కోటేశ్వర స్వామి వద్ద కార్తీక దీపాలు వెలిగించి మహిళ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు భక్తులచే పూజలు చేయించారు.

ఆశ్రమాలు, పాఠశాలల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జగిత్యాల అర్బన్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లాలో దివ్యాంగుల కోసం నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి నరేష్ తెలిపారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం ఈనెల 15 లోగా జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం కలెక్టరెట్‌లోని రూం నెంబర్ 7లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 16 తర్వాత రిజిస్ట్రేషన్ లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివరాలకు టోల్ ఫ్రీ 155326కు ఫోన్ చేసి తెలు సుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల ఆర్టీసీ డిపో మేనేజర్ కాసర్ల కిరణ్ తండ్రి కాసర్ల వీరేశం ఇటీవల మరణించగా ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం పరామర్శించారు. 5వ వార్డుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కాంతయ్య కుమారుడు మహేష్ గుండె పోటుతో మరణించగా కుటుంబసభ్యులను పరామర్శించారు.

నోట్ల సంచులు మోసే సంస్కృతి కాంగ్రెస్‌ది కాదు

- బీఆర్ఎస్ నేత కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నోట్ల సంచులు మోసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కాదని, బీఆర్ఎస్ నేత కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అది అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అనవసర ఆరోపణలు చేయడం తగదన్నారు. టెక్నికల్ కారణాలతో రుణ మాఫీ ఆగిందని, ఈ నెలాఖరు వరకు మిగిలిన లబ్ధిదారులకు అందరికీ మాఫీ చేసి తీరుతామన్నారు. పాదయాత్ర పేరుతో ప్రభుత్వంపై విమర్శలతో దాడులకు దిగడం సరికాదని, ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉందని హామీలు అమలు చేసి తీరుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై గానీ, రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ఉనికి చాటుకునేందుకు బీఆర్ఎస్ నేతల విమర్శలు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

ఉనికి చాటుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి విధానం మానుకోవాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్థిక మంత్రిగా బీఆర్ఎస్ సర్కారులో పనిచేసిన హరీశ్ రావుకు విషయం తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోపే రూ. 18 వేల కోట్ల రుణ మాఫీ చేసిందనానరు. 2008-09లో దేశంలో ఏక కాలంలో రుణ మాఫీ చేసిన ఘనత యూపీ సర్కారుకు దక్కిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుకు వడ్డీ కట్టడానికి మళ్లీ అప్పులు చేయాల్సి వస్తుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంమూసీ ప్రక్షాళన ఆవశ్యకతను గుర్తించి మూసీ ప్రక్షాళన మొదలు పెట్టారని వివరించారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, నాయకులు కొత్త మోహన్, పిప్పరి అనిత, రమేశ్ బాబు, శీలం సురేందర్, ఎంఏ బారి, గుండా మధు, నేహల్, రాజేశ్ పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్ రెడ్డి

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పది ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి ఉపాధ్యాయలకు సూచించారు. బుధవారం పట్టణంలోని కేరళ ప్రైవేట్ పాఠశాలలో 8 మండలాల డివిజన్ స్థాయి ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహిం చగా డీఈవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. జాతీయ సాధన సర్వే 2024 పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిసెంబర్ 4న నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్షలు (నాస్) జగిత్యాల జిల్లా మంచి స్థానంలో నిలిపేందుకు 3,6,9 తరగతుల విద్యార్థులకు నాస్ పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. విద్యా ర్థులలో నైపుణ్యం నింపేందుకు బోధించే విధానంపై ఉపాధ్యాయులకు మానిటరింగ్ ద్వారా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, జిల్లా సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, కొక్రుల రాజేష్, సంతోష్, అంజయ్య, కేరళ హైస్కూల్ కరస్పాడెంట్ బారీ, కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మల్లాపూర్, రాయికల్, బీమారం, మేడిపల్లి ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారులు నరేశం, చంద్రశేఖర్, శ్రీనివాస్, దామెదర్‌రెడ్డి, రాఘవులు, మధుసూదన్‌రెడ్డి, ఆకుల లక్ష్మినారాయణ, మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో బుధవారం సత్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉదయ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్, రాజు, మల్యాల జలపతి రెడ్డి, కొడిపెల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

సర్వేకు ఇంటి యజమానులు సహకరించాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కోరుట్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సర్వే బృందాలకు ఇంటి యజ మానులు వివరాలు అందించి సహకరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలో సమగ్ర సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసి నమోదు వివరాల పట్టికను పరిశీలించారు. పలు ఇండ్లల్లో కలెక్టర్ స్వయంగా వివరాలను నమోదు చేసి తీసుకునే జాగ్రత్తలను సర్వే బృందాలకు వివరించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలకు కలెక్టర్ పలు సూచనలు సలహాలను అందించారు. ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలను ఇంటి యజమానులకు వివరించి వారి నుంచి వివరాలను సేకరించాలన్నారు. ఆర్‌డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన కలెక్టర్

మెట్‌పల్లి టౌన్ : సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని అర పేట గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. సర్వే బృందం నిర్వహిస్తున్న నమోదు వివరాలను తనిఖీ చేసిన కలెక్టర్ సర్వే బృందాలకు పలు సూచనలు సలహాలను అందించాలని సూచించారు. సర్వేకు వచ్చు బృందాలకు ఇంటి యజమానులు సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీవో నక్క శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
ఆన్‌లైన్ దూరవిద్య-డిగ్రీ, పిజి
B.A. B.Com. B.B.A. MCJ
M.B.A. M.C.A. M.Com MSW
M.A. Open INTER, SSC
B.Li.Sc, M.Li.Sc.
Admission Last Date : 15-11-2024
UGC అనుమతించిన ఈ కోర్సులు పై చదువులకు, ప్రమోషన్లకు, ఉద్యోగాలకు అర్హులు.
SRI KALKI-JAGTIAL
9666954666, 9298259856, 9494357266

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME
★ I TOGETI NARESH S/O RAMANAIAH R/O HNO 7-136/- VELLULLA (V) METPALLY (M) JAGITHYAL DIST NOW I CHANGED MY SURNAME AS THOGITI NARESH S/O RAMANAIAH
AJK-16152

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మిందబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

క్రైం కార్నర్

దుబాయిలో అంబారిపేట మహిళ మృతి



సుప్రియ (ఫైల్)

కథలాపూర్/గల్ఫ్ ప్రతినిధి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటకు చెందిన ఎన్నమనేని సుప్రియ (35) అనే వివాహిత దుబాయిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం... సుప్రియకు రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన శ్రీనివాసరావుతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లైన కొన్నేళ్లకే దుబాయికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. గత సోమవారం కొడుకు, కూతురును పాఠశాలకు పంపించగా భర్త శ్రీనివాసరావు ఎప్పటి మాదిరిగానే విధులకు వెళ్లాడు. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సరికి సుప్రియ మృతి చెంది ఉంది. ఆమె మృతికి గల కారణాలు తెలియలేదు. సుప్రియ మృతదేహం స్వగ్రామం చేరుకోడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు.

రైలు కింద పడి చింతలూరువాసి మృతి



శ్రీకర్(ఫైల్)

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన ముద్దం శ్రీకర్ ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైలు ఎక్కుతూ రైలు కింద పడి మరణించాడు. చింతలూరు గ్రామానికి చెందిన శ్రీకర్ ఈ నెల 8న కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి దైవదర్శనానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు గూడూరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ కింద పడి మరణించాడు. విషయం తెలిసిన గ్రామ నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌తో మాట్లాడి మృతదేహాన్ని త్వరి తగతిన తెలంగాణకు పంపాలని కోరారు. అలాగే కలెక్టర్ సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం పక్షాన అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన ఉదయశ్రీ (20) అనే బీ ఫార్మసీ విద్యార్థిని బుధవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉదయశ్రీ వరంగల్ ఓ ప్రైవేట్ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతోంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తిరుపతి వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. రైలు ఎక్కుతున్న క్రమం లో ఉదయశ్రీ ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారం నుంచి కింద పట్టాలపై పడిపోయింది. గమనించిన రైల్వే సిబ్బంది తీవ్రగాయాలు పాలైన ఉదయశ్రీని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తుండగా బుధవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఒక్కగానొక్క కూతురు మృత్యువాత పడడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో చోరీ జరిగింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన కందుకూరి రాఘవయ్య అనే రిటైర్డు ఎంఈవో పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న బ్యాంకులో తన అవసరం నిమిత్తం లక్ష రూపాయలు విత్ డ్రా చేశాడు. అనంతరం కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మీ సేవలో లైఫ్ సర్టిఫికేట్ కోసం వెళ్లాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనం దగ్గరికి గుర్తు తెలియని వ్యక్తి ద్వి చక్ర వాహనంపై వచ్చి రాఘవయ్యతో మాట మాట కలిపి జేబులోంచి డబ్బులు కింద పడిపోయాయని నమ్మించాడు. రాఘవయ్య కిందికి వంగి చూసే లోపే తన ద్విచక్ర వాహనం ముందు ఉన్న లక్ష రుపాయల నగదు బ్యాగును అపహరించుకవెళ్లాడు. తేరుకున్న బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల జిల్లా బీమ్‌నూర్ గ్రామానికి చెందిన మావినేని రమేష్ (45) అనే వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రెండో టాణా హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 8న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడన్నారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని తెలిపారు. రమేష్ వివరాలు తెలపలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామన్నారు.

దక్షిణాది కొంగు బంగారం

నేడు రామగుండం ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

వెలుగుల దివ్వెకు 47 వసంతాలు



తెలంగాణ ఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తోంది. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తితో పాటు నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ దక్షిణాది కొంగుబంగారంగా గుర్తింపు పొందింది. సామాజిక బాధ్యతలో భాగంగా ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో ఆయా గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకున్న ఈ 'వెలుగుల దివ్వె' 46 వసంతాలు పూర్తి చేసుకుని గురువారం 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

400 మెగావాట్ల తెలంగాణ ఎస్టీపీపీ..

రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు పక్కనే 4000 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు స్టేజ్ 1 కింది నిర్మించిన 800 మెగావాట్ల 2 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. రెండో దశలో మరో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పనున్నారు. స్టేజ్ 2కు సంబంధించి ఈనెల 29న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు. ఇటీవలే స్టేజ్ 2కు 29,344.85 కోట్ల రూపాయల వ్యయాన్ని ఎన్టీపీసీ బోర్డు పెట్టుబడిగా ఖరారు చేసింది. ఎల్‌అండ్‌టీ సంస్థకు నిర్మాణ కాంట్రాక్టు దక్కినట్లు సమాచారం. 4000 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే ఒకే ప్రాంతం నుంచి అత్యధిక విద్యుత్ ఉత్పత్తి(6600 మెగావాట్లు) చేస్తున్న ప్రాజెక్టుగా రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు సాధించనున్నది.

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో అతి పెద్ద సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం రామగుండం ఎన్టీపీసీ.. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. నిర్దేశిత లక్ష్యాలను అధిగమిస్తూ.. ముందుకు సాగుతోంది.. ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 1978 నవంబరు 14న పునాది రాయి పడిన ఈ వెలుగుల దివ్వె నాలుగున్నర దశాబ్దాలుగా జాతికి వెండి వెలుగులను పంచుతున్నది. నేటితో 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ లిమిటెడ్‌కు చెందిన 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ దక్షిణాది విద్యుత్ అవసరాలను గణనీయంగా తీరుస్తున్నది. ప్రతి ఏటా ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నది. 1978 నవంబరు 14 అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ చేతుల మీదుగా పునాది రాయి పడిన ఈ ప్రాజెక్టులోని యూనిట్లు నిర్ణీత గడువుకన్నా ముందే ఉత్పత్తిని ప్రారంభించాయి.

యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభ వివరాలు..

స్టేజ్-1

- 200 మెగావాట్ల 1వ యూనిట్ 1983 అక్టోబర్ 26
- 200 మెగావాట్ల 2వ యూనిట్ 1984 మే
- 200 మెగావాట్ల 3వ యూనిట్ 1984 డిసెంబర్

స్టేజ్-2

- 500 మెగావాట్ల 4వ యూనిట్ 1988 జనవరి
- 500 మెగావాట్ల 5వ యూనిట్ 1989 మార్చి
- 500 మెగావాట్ల 6వ యూనిట్ 1989 అక్టోబర్

స్టేజ్-3


- 500 మెగావాట్ల 7వ యూనిట్ 2004 సెప్టెంబర్

ఏ రాష్ట్రానికి ఎంత విద్యుత్...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు(29శాతం)
- తమిళనాడుకు 572 మెగావాట్లు(22శాతం)
- కర్నాటకకు 416 మెగావాట్లు(16శాతం)
- కేరళకు 312 మెగావాట్లు(12శాతం)
- గోవాకు 130 మెగావాట్లు(5శాతం)
- పాండిచ్చేరికి 52 మెగావాట్లు(2శాతం)
- ఎవరికీ కేటాయించనిది (అన్ అలాటెడ్) 364 మెగావాట్లు(14శాతం)

ప్రతిష్టాత్మకమైన అమెరికా పవర్ అవార్డు సొంతం..

అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన అమెరికాకు చెందిన పవర్ మేగజైన్ రామగుండం ఎన్టీపీసీని ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తించింది. మేగజైన్ ఎడిటర్ల కమిటీ గుర్తించిన 7 అత్యుత్తమ ప్లాంట్లలో రామగుండం ప్లాంటుకు ప్రపంచంలో 2015 ఏడాదికిగాను టాప్ ప్రాజెక్టుగా అవార్డును ప్రకటించింది. 130 ఏళ్ల చరిత్ర ఉన్న పవర్ పత్రిక అవార్డు లభించడం అంటే నోబుల్ ప్రైజ్ వచ్చినట్లుగా ప్రపంచంలోని విద్యుత్ సంస్థలు భావిస్తాయి.



రామగుండం సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం

ప్రాజెక్టుకు లభించిన అవార్డులు..

రామగుండం ఎన్టీపీసీకి ఈ 47 సంవత్సరాలలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో టస్కర్ నుంచి నాలుగు నేషనల్ అవార్డులను సాధించింది. ఎనర్జీ ఎఫిషియెన్సీ 2024 అవార్డు, ఎనర్జీ లీడర్‌షిప్ 2024 అవార్డు గ్రీన్‌టెక్ జాతీయ సేఫ్టీ ప్లాటినం అవార్డు, బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు, పలుమార్లు స్వర్ణశక్తి అవార్డులు, విశ్వకర్మ జాతీయ అవార్డులు లభించాయి.

సామాజిక బాధ్యత..

విద్యుత్ ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతపైన కూడా యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నది. గత 16 ఏళ్లలో సంస్థ సుమారు 500 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. స్వచ్ఛ భారత్‌లో రెండేళ్ల క్రితం తెలంగాణలోని 4 జిల్లాల్లో 11 కోట్ల రూపాయలతో 777 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, వ్యవసాయానికి, స్వయం ఉపాధి కోసం సంస్థ చేయూతనిస్తోంది. సీఎస్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో వివిధ సౌకర్యాలను కల్పిస్తోంది.

పర్యావరణ పరిరక్షణకు కృషి..

పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్టీపీసీ విశేష కృషి చేస్తున్నది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో లక్షలాది మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తోంది. ఎన్టీపీసీ పరిసర ప్రాంతంలో సుమారు 14 లక్షల చెట్లను సంస్థ సంరక్షిస్తున్నది. ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద సమస్యను నివారించడానికి సిమెంటు, ఇటుకల పరిశ్రమలకు బూడిదను సరఫరా చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రాజెక్టుకు గతంలోనే ఐఎస్‌వో-14001 గుర్తింపు లభించింది.

సమష్టి కృషితో ప్రగతి పథంలో ఎన్టీపీసీ

కేదార్ రంజన్ పాండు, ఆర్‌ఈడీ



ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమష్టి కృషి ఫలితంగా రామగుండం ప్రాజెక్టు ప్రగతి పథంలో నడుస్తోంది. రక్షణతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఉత్పత్తి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సీఎస్ ఆర్, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. ఎన్టీపీసీ రేజింగ్ డే సందర్భంగా సిబ్బందికి, ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు.





సీఎస్‌ఆర్ కింద పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, 1983లో మొదటి యూనిట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి జీఎం ఎం.ఎ.హాయ్ (ఫైల్)

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

- రెండో రోజు వ్యవసాయ కళాశాల విద్యార్థుల కల్చరల్ మీట్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

తంగళ్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ రాష్ట్రస్థాయి ఇంటర్ కాలేజీ కల్చరల్ మీట్‌లో బుధవారం విద్యార్థుల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో ప్రారంభమైన రెండవ రోజు కల్చరల్ మీట్ లో విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రోజులపాటు సాగే కల్చరల్ మీట్ లో తెలంగాణలోని 11 వ్యవసాయ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, 200 అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం వివిధ కళాశాల చెందిన విద్యార్థులు జానపద నృత్యం, ముకాభినయం, నాటిక లను ప్రదర్శించారు. అలాగే పలు అంశాలపై డిబేట్, క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. నేడు కల్చర్ మీటు ముగింపు కార్యక్రమం ఉంటుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోన వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం బుధవారం వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపి ప్రత్యేక వేదికపై అలివేలు మంగ, లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించి కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

కులగణనలో బీసీలందరూ పాల్గొనాలి

- అగ్రకులాల కుట్రను తిప్పికొట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కులగణనలో ఎలాంటి అపోహలకు, సందేహాలకు తావు లేకుండా బీసీ కులాల ప్రజలంతా పాల్గొనాలని, బీసీ కులాల లెక్కలు తేలడానికి సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కులగణన చైతన్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ కులాల లెక్కలు జరగకుండా అనేక మంది కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కుట్రలను ఛేదించి బీసీలంతా అప్రమత్తంగా ఉండి వారి కులాన్ని తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. సమగ్ర కులగణన సేకరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై కులగణన వ్యతిరేకులు అక్కడక్కడ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

అటువంటి వారిని ప్రభుత్వం గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కులగణనపై కొందరు కావాలనే లేనిపోని అపోహవాలు సృష్టించి ప్రజల్ని తీవ్రగందరగోళంలోకి నెట్టివేస్తున్నార న్నారు. కులగణనలో పేర్కొన్న ఆర్థికపరమైన అంశాలు చెబితే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దక్కవని, అబద్దపు ప్రచారాన్ని చేస్తున్నారని తెలిపారు. సమగ్ర కులగణన ద్వారా బీసీ కులాల లెక్కలు తేలితే భవిష్యత్తులో తమ పీఠాలకే ఎసరు వస్తుందనే ఉద్దేశంతో కొంత మంది రాజకీయ ముసుగులో అగ్రకుల నేతలు కులగణనపై ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కుల గణలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన 56 ప్రశ్నలకు తమకు ఇష్ట మున్న సమాచారాన్ని అందించి, కులాన్ని మాత్రం తప్పని సరిగా చెప్పాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చైతన్య సదస్సుల ద్వారా బీసీ కులాలను చైతన్యం చేస్తున్నామని అయన తెలిపారు. కులగణనపై సందేహాల ను తీర్చడానికి సచివాలయంలో టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజులకు ఒకసారి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జీవిస్ ఆనంద్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల మధు, జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య, రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, సురేందర్, వట్టి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠ శాలకు చెందిన శివకుమార్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కొడిమ్యాలలో జరిగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచాడు. దీంతో ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పాఠ శాలల వాలీబాల్ పోటీలలో శివకుమార్ ఉమ్మడి కరీంనగర్ జట్టుకు ప్రాతినిథ్యం వహించ నున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు అనుపమ, పీడీ విశ్వప్రసాద్ తెలిపారు. శివకుమార్‌ను పాఠశాల చైర్‌పర్సన్ అర్షనపల్లి రజిత, హెచ్ ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కొనసాగుతున్న గురుకుల క్రీడా పోటీలు



మానకొండూర్ గురుకుల పాఠశాలలో జమ్మికుంట-రుక్మాపూర్ కబడ్డి మ్యాచ్

మానకొండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధరకాల అంశాల్లో పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 1190 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. గురువారం క్రీడల ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.ఇల్లంతకుంట సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసినట్లు పేర్కొన్నారు. రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని వంతడుపులకు చెందిన నర్సయ్య, బాబు, కందికట్కూర్‌కు చెందిన అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పల్లె ప్రకృతి వనం చెట్లు నరికిన వారిపై కేసు

వీణవంక నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం చెట్లను నరికిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. పల్లె ప్రకృతి వనంలో కోర్కల్‌కు చెందిన పూదరి కృష్ణ, ఊదరి అనిల్‌గౌడ్ మరి కొంతమందితో కలిసి 32 చెట్లను నరికివేశారన్నారు. కోర్కల్ పంచాయతీ కార్యదర్శి బొడ్డు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బేగంపేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌పై చీటింగ్ కేసు నమోదు

రామగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మండే హేమపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్ని రోజులుగా ఖాతాదారులకు సంబంధించిన డబ్బులను వారి ఖాతాల్లో జమచేయకుండా సొంత అవసరాలకు వాడుకోవడం, అదేవిధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల అకౌంట్ ఖాతాదారుల వద్ద డబ్బులు తీసుకుని వారికి దొంగ పాస్‌బుక్కులు జారీ చేశారు. ఈ విషయమై విచారణ చేపట్టిన పోస్టల్ అధికారులకు 54మంది బాధితుల వద్ద 34లక్షల87వేల 22 రూపాయలు దుర్వినియోగం చేసినట్లుగా గుర్తించారు. దీనిపై గోదావరిఖని పోస్ట్ ఆఫీసు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం మంథని సీఐ రాజు, ఎస్ఐ చంద్రకుమార్‌లు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని పలువురు బాధితులను అడిగి తెలుసుకున్నారు. మిగతా ఎవరైనా బాధితులు ఉన్నట్లైయితే స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా సీఐ సూచించారు.

ఒకరి అరెస్టు

కోనరావుపేట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని పట్టా చేయిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్దపల్లి స్వామి అనే రైతు పొలం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎండీ పాషా అనే వ్యక్తి పట్టా చేయిస్తానని నమ్మబలికాడు. మోసపూరితంగా రూ.40 వేలను తీసుకున్నాడు. పట్టా చేయమంటే చేయకుండా తప్పించుకుంటున్నాడు. బాధితుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చోట్ల వాహనాలను పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. ఇందిరాచౌక్‌తోపాటు పలు కూడళ్లలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి వివరాలు సేకరించి ప్రశ్నించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలతోపాటు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తనిఖీ చేశారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులను చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామ శివారులో గంజాయి సేవిస్తూ పట్టుబడిన నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్సై కిరణ్‌కుమార్‌తో కలిసి వివరాలను తెలిపారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్ గ్రామానికి చెందిన కండెల రవితేజ, రత్నాపూర్‌కు చెందిన సుద్దపల్లి సాయికుమార్ ఇద్దరు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఎస్సైతో కలిసి దాడులు చేశామన్నారు. వారి వద్ద ఉన్న సుమారు 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారు కొంత కాలం నుంచి గంజాయి తీసుకొచ్చి వాటిని చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని యువతకు విక్రయిస్తున్నట్లు తెలిపారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌యూలో ఏఐపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి విష్ణువర్ధన్

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా కృత్రిమ మేధా (ఏఐ), దాని అనువర్తనాలు అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తుందన్నారు. ముఖ్యంగా వైద్యరంగంలో చాలా మార్పులను తీసుకువస్తుందని తెలిపారు. అనంతరం హైదరాబాద్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచాన్ని శాసించబోయే టెక్నాలజీగా కృత్రిమ మేధను అభివర్ణించారు. సైన్స్‌కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధపై అవగాహన ప్రతీ ఒక్కరికి అవసరం అని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం అర్జున్ గౌడ్, జి నరసింహచారి, విజయేశ్వరి, ఇతర విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలం ప్రత్యేక బస్సులకు విశేష ఆదరణ

- ఇకపై ప్రతీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు
- ఆర్టీసీ ఆర్‌ఎం ఎన్ సుచరిత

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంలో పౌర్ణమిగిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం కరీంనగర్ రీజియన్ పరిధిలో నడిపించిన ఐదు ప్రత్యేక బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభించినట్లు ఆర్‌ఎం సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, హుస్నాబాద్, వేములవాడ, గోదావరిఖని, జగిత్యాల నుంచి కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం ఐదు బస్సులను వేయగా అన్ని బస్సుల్లో సీట్లు పూర్తికావడమే కాకుండా, ఇంకా చాలా మంది అరుణాచల క్షేత్రానికి వెళ్లేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇకపై ప్రతీ పౌర్ణమి రోజున ప్రత్యేక బస్సులను నడిపిస్తామని ఆర్‌ఎం తెలిపారు.

'పీఎం సూర్యఘర్'తో సౌర వెలుగులు

- తగ్గనున్న విద్యుత్ చార్జీల భారం
- సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ. 78 వేల వరకు సబ్సిడీ



ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

చలికాలమైనా, ఎండ కాలమైనా ఫ్యాన్లు, ఏసీలు వేసుకోక తప్పని వాతావరణం.. దిగువ మధ్య తరగతి కుటుంబమైనా.. అల్పాదాయ కుటుంబమైనా కూలర్, రిఫ్రిజిరేటర్, టీవీ సాధారణమైన రోజులు ఇవి.... దీంతో విద్యుత్ వినియోగం ఎక్కువైపోయి చార్జీల భారం తడిసిమోపెడవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నెలకు200 యూనిట్ల వినియోగం వరకు జీరో బిల్ ఇస్తూ ఆ చార్జీల భారాన్ని మోస్తున్నా దిగువ మధ్యతరగతి కుటుంబానికి నెలకు 250నుంచి 300 యూనిట్లకు వరకు విద్యుత్ వినియోగం తప్పనిసరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 'సూర్య ఘర్.. ముఫ్త్ బిజిలీ యోజన' ప్రజలకు వరంగా మారింది.

● కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలు

సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రెండు కిలో వాట్ల సామర్థ్యంగల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకునేందుకు కిలో వాట్‌కు 30 వేల రూపాయలు సబ్సిడీగా ఇస్తోంది. రెండు కిలో వాట్స్ ప్యానళ్ల ఏర్పాటుకు 60 వేలు, అద నంగా మరో కిలో వాట్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే 18 వేల సబ్సిడీని ఇస్తుంది. మూడు కిలో వాట్స్ సామర్థ్యం వరకు గృహావసరాల కోసం ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే 78వేల సబ్సిడీని పొందే అవకాశం ఉన్నది. ఆపై కెపాసిటీ ఉన్న ప్యానళ్లను అమర్చుకుంటే 78వేల రూపాయల సీలింగ్‌తో సబ్సిడీ అందజేస్తున్నది. 150 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్నవారు రెండు కిలో వాట్స్ వరకు 150 నుంచి 300 విద్యుత్ వినియోగం ఉన్నవారు రెండు నుంచి మూడు కిలో వాట్స్ వరకు, 300 యూనిట్లపై వినియోగం ఉన్నవారు మూడు కిలో వాట్స్ సామర్థ్యం ఉన్న ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడానికి 2.10 లక్షల నుంచి 2.35 లక్షల రూపాయల వరకు ఖర్చు వుతుంది. ఇందులో 78వేల రూపాయలు కేంద్రం సబ్సిడీ పోను వినియోగదారుడు 1.52 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది.

● మిగులు విద్యుత్‌ను అమ్ముకునే అవకాశం

మూడు కిలో వాట్‌ల సోలార్ ప్యానళ్ల నుంచి నెలకు వాతావరణ పరిస్థితుల మేరకు 320 నుంచి 340 యూనిట్ల సోలార్ పవర్ ఉత్పత్తి అవుతుంది. వినియోగదారుడు అందులో250 యూనిట్లను వినియోగించుకుంటే మిగిలిన 90యూనిట్ల విద్యుత్‌ను డిస్కమ్ కొనుగోలు చేస్తుంది. 250యూనిట్ల విద్యుత్ వినియోగించుకుంటే యూనిట్ చార్జీలు, ఇతర చార్జీలు కలుపుకొని 2,500 రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఈ బిల్లు తప్పడంతోపాటు మిగిలిన 90 యూనిట్ల విద్యుత్‌కు డిస్కమ్ యూనిట్‌కు ఐదు రూపాయల చొప్పున 450 రూపాయలు చెల్లిస్తుంది. వినియోగదారుడు సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు 1.52 లక్షలు వెచ్చిస్తే నెలకు మూడు వేల రూపాయల విలువ చేసే విద్యుత్‌ను పొందే అవకాశమున్నది.

● బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం

సోలార్ విద్యుత్ కోసం వినియోగదారులు తమ ఇళ్ల లో ఎలక్ట్రిసిటీ ఫిట్టింగ్‌ల్లో ఎలాంటి మార్పులు చేసుకో వలసిన అవసరం లేదు. ఇంటికి ఉన్న మీటర్‌ను మార్చి దాని స్థానంలో ఇన్‌పుట్, అవుట్‌పుట్ సదుపాయముండే ప్రత్యేక మీటరును అమర్చుతారు. ఈ మీటరుతో సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తిఅయ్యే విద్యుత్‌ను వినియోగించుకోగా మిగిలింది ఎప్పటికప్పుడు డిస్కమ్‌లకు చెందిన గ్రిడ్‌కు వెళ్లిపోతుంది. రాత్రి పూట వినియోగదారులు డి స్కమ్‌ల నుంచి సరఫరాఅయ్యే విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. డిస్కమ్‌లు ఇంటిలో ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్ ఎంత, వినియోగించుకున్నది ఎంత... లెక్కించి మిగిలిన విద్యుత్‌కు యూనిట్‌కు ఐదురూపాయల చొప్పున యజమానికి చెల్లిస్తారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకో వడానికి బ్యాంకులు రుణసౌకర్యాన్ని ఏడు శాతం వడ్డీపై అందిస్తున్నాయి. హౌసింగ్ సొసైటీ గ్రూపులకు, అపార్టుమెంట్లకు, రెసి డెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు కేంద్ర ప్రభుత్వం కిలోవాట్‌కు 18 వేల రూపాయల చొప్పున మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానళ్ల వరకు 54వేల సబ్సిడీని అందజేస్తుంది. ఈ సంస్థలు రిజిస్టర్‌అయి ఉండాల్సి ఉంటుంది.

● పెరుగుతున్న ఆదరణ

ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ పరిధిలో ఉన్నది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీ ఎల్) పరిధిలో ఉండడంతో ఈ జిల్లాల్లో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ (టీజీఆర్ ఈడీసీవో) లిమిటెడ్ ద్వారా పీఎం సూర్యఘర్.. ముఫ్త్ బిజిలీ యోజనను అమలుచేస్తున్నారు. ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లాలో 529 మంది, జగిత్యాలలో 205మంది, పెద్దపల్లిలో 208 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి ఇళ్లలో సోలార్ విద్యుత్ ప్యానళ్లను అమర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● ప్రభుత్వ కార్యాలయాల్లో సౌరవిద్యుత్

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏర్పాటును తప్పనిసరి చేస్తూ కలెక్టర్లకు లేఖలు రాశారు. ఈ అంశంపై టీజీ రెడ్‌కో అధికారులు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మార్కెట్ గోడౌన్లు, కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్లలో సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయని రెడ్‌కో జిల్లా మేనేజర్ సందీప్‌కుమార్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె లక్ష్మీకాంతరావు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించే విద్యుత్‌కు ఎన్‌పీడీసీఎల్‌కు యూనిట్‌కు తొమ్మిది రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ పథకం కింద సోలార్ విద్యుత్ యూనిట్‌కు 3.74 రూపాయల మాత్రమే చార్జీలుగా తీసుకోనున్నారు. ఈ విద్యుత్ వినియోగంతో ఒక్కో యూనిట్‌పై ప్రభుత్వానికి ఐదు రూపాయలపైగానే ఆదా అయ్యే అవకాశముండడంతో అన్ని కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయని చెప్పారు. గృహ వినియోగానికి సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు విషయంలో ప్రజలకు అవగాహన పెరిగిందని, ఇప్పుడిప్పుడే ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా సబ్సిడీ పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు.

కొత్త బియ్యంతో అన్నం ముద్దలవుతోంది

- రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సివో అంజలి

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త బియ్యంతో సరిగా వండకపోవడంతో అన్నం ముద్దలుగా మారి విద్యార్థులు ఇబ్బంది పడ్డారని రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి తెలిపారు. మండలంలో రామకృష్ణకాలనీలోని గన్నేరువరం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలను రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి బుధవారం సందర్శించారు. పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు ముద్దలుగా మారిన అన్నం పెడుతున్నారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ మేరకు ఆర్‌సీవో అంజలి పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బందితో కలిసి డైనింగ్‌హాల్‌కు వెళ్లి వంట చేసే వారితో మట్లాడానన్నారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త బియ్యాన్ని ఎలా వండాలనే విషయంపై వంటలు చేసేవారిని సూచనలు చేశామన్నారు. ఇక ముందు అన్నం మెత్తగా కాకుండా చూసుకుంటామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అభినందించారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రామగుండంలో అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తగరపు శంకర్, సురేష్, శ్రీనివాస్, శంకర్, రాజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ఆలయాలకు కార్తీక శోభ



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురిలో కార్తీక భక్తుల సందడి

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం కార్తీక భక్తుల సందడి నెలకొంది. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు.

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పన్నెండవ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయంలో ..

వేములవాడ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కార్తీకదీపోత్సవం కొనసాగుతోంది. బుధవారం రాజన్న ఆలయ అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక కార్తీకదీపాలను వెలిగించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ముందుగా తలనీ లాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించారు.



వేములవాడలో కార్తీక దీపోత్సవం

రాజన్న సేవలో తొగుట పీఠాధిపతి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి స్వా మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దాల మండపంలో అర్చకులకు, అధికా రులకు ప్రసాదం అంద జేశారు.

యూనివర్సిటీ మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కృషి

- శాతవాహన వీసీ ఉమేష్ కుమార్
- ఎస్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ నిర్వహణ కోసం సింథటిక్ ట్రాక్ నిర్మించేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అంతర్ డిగ్రీ కళాశాలల మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో రాణిస్తుండడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే శాతవాహన క్రీడాకారులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీ మైదానంలో వరుసగా రెండు సంవత్సరాలపాటు పీ సెట్‌ను విజయవంతంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్, ఎస్‌యూ ఫిజికల్ డైరెక్టర్ విజయకుమార్, వివిధ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు నాగేశ్వర్‌రావు, శ్రీధర్ రావు, పి శ్రీనాథ్ రెడ్డి, దినేష్ పర్వీన్, కదారి రవి, వరుణ్ కృష్ణ, దేవిక, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- శరవేగంగా ట్రాక్ మరమ్మతులు
- ఇతర మార్గాల ద్వారా పలు రైళ్ల మళ్లింపు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీ, దక్షిణ మధ్య రైల్వే జీఎం, కలెక్టర్



పట్టాలను సరిచేస్తున్న కార్మికులు, యంత్రాలు

పెద్దపల్లి రూరల్/పాలకుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ రైల్వే స్టేషన్, కన్నాల మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఢిల్లీ, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే సుమారు 31 రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను దారి మళ్లించారు. ఘటనా స్థలాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సందర్శించి ప్రమాద వివరాలు అడిగితెలుసుకున్నారు. త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల మార్గంలోని ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సంఘటనా స్థలాన్ని సందర్శించి సింగరేణి సంస్థతో మాట్లాడి ఘటనా స్థలానికి భారీ క్రేన్‌లను వచ్చే విధంగా చర్యలు చేపట్టి పనులను ప్రారం భించారు. ఆయన వెంట పాలకుర్తి తహ సీల్దార్ జ్యోతి, పలువురు అధికారులు ఉన్నారు.



పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

● 31 రైళ్లను రద్దు చేసిన అధికారులు

పెద్దపల్లి జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన దృష్ట్యా అధికారులు 31 రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. నర్సాపూర్- సికింద్రబాద్, సికింద్రబాద్- నాగ్‌పూర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్ - కరీంనగర్, కరీంనగర్ - బోధన్, సిర్పూర్ టౌన్- భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్ష, బల్లార్ష-కాజీపేట, యశ్వంత్‌పూర్- ముజఫర్‌పూర్ రైళ్లను రద్దు చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- విజయోత్సవాలకు నిధులుంటాయి కానీ బకాయిలకు లేవా?
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విజయోత్సవం నిర్వహించడానికి నిధులు ఉంటాయి కాని.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడానికి లేవా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉందంటూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విజయోత్సవాలను నిర్వహించకుండా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలల్లో తరుచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని, విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్నా ట్రిబుల్ ఐటీ ఊసెత్తడం లేదని మండిపడ్డారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులభర్తీ చేయడం లేదన్నారు. విద్యారంగంపై ఇప్పటివరకు సమీక్ష లేదని, విద్యరంగ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళదామంటే అపాయింట్‌మెంట్ దొరకడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాపు వెంకటేష్, మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, శ్రావణ్, సాయి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కథలాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండకు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయడం పట్ల బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నో రోజులుగా రైతాంగం ఎదురు చూస్తున్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చి కొద్ది రోజుల్లోనే ఎమ్మెల్యే మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, మండల బీసీ విభాగం అధ్యక్షుడు అలకొండ లింగంగౌడ్, మేదరవేని రాజు, ముంజ జలంధర్, సత్యనారాయణ ఉన్నారు.

అంబేద్కర్ మాల సంఘం మండలాధ్యక్షుడిగా ప్రశాంత్

కథలాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడిగా దయ్య ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యవర్గం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జంగం నరేశ్, ఉపాధ్యక్షులుగా తలారి మోహన్, అంబటి రాధాకృష్ణ, కోశాధికారిగా బోడ నాగరాజు లను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని సంఘ సభ్యులు శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కోట లక్ష్మీనర్సయ్య, బుర్రి గణేశ్, బత్తుల నరేశ్, మైస శ్రీధర్, ఆకుల నారాయణ, కడారి స్వామి, సంజీవ్, వివిధ గ్రామాల సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

మెట్‌పల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి, మెట్‌పల్లి చేనేత ఐక్య వేదిక నియోజకవర్గ ఇన్‌చార్జిగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన జడల తిరుపతిని నియమిస్తూ బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ నుంచి నియమకం పత్రం అందినట్లు పద్మశాలి సంఘ నాయకులు తెలిపారు. తిరుపతి మాట్లాడారు. తన నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ వీర మోహన్, పద్మశాలి సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాప పరిహారం కోసమే బీఆర్ఎస్ నేతల పాదయాత్ర

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్

కథలాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం పాపపు పాలనతో విధ్వంసం చేసి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ నేతలు తమ పాప పరిహారం కోసమే పాదయాత్ర చేశారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో భారత్ ఎలక్ట్రికల్ ఈ బైక్ షోరూం ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్ రైతుల ఆశాదీపంగా ఉన్న చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తామని నమ్మించి అన్నదా తల ఆశలపై నీళ్లు చల్లిన నేతలు మొసలి కన్నీరు కారుస్తూ ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేశారని ప్రశ్నించారు. 2018లో సూరమ్మ కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి రు. 206 కోట్లు కేటాయించి కనీసం తట్టెడు మట్టి తీయించని నాటి భారీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు పాదయాత్రకు రావడం సిగ్గు చేటని విమర్శించారు. మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల్లో సుమారు 43 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరందించ లేక పోయారన్నారు. లక్ష రూపాయల రుణ మాఫీ చేయలేని వారు రోడ్లపై పాదయాత్రకు బయలు దేరడం హాస్యాస్పదమన్నారు. కేవలం 27 రోజు ల్లోనే రైతులకు రు. 18 వేల కోట్లు రుణ మాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికి దక్కిందన్నా రు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీకి పాత బకాయిలు చెల్లించామని గుర్తు చేశారు. కేవలం ప్రభుత్వంపై ఈర్ష్య భావన, ఓర్వలేనితనంతోనే తమ సొంత ప్రయోజనాలు, ఉనికి కోసమే ఆ పార్టీ నేతలు పాదయాత్ర చేస్తున్నారని ఆరోపించారు. పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అల్లూరి దేవన్న, రాష్ట్ర ఫిషరీస్ విభాగం కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్, రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, విజయ్, శేఖర్, లింగారావు, సత్యనారా యణ ఉన్నారు.

కవిత కృషితోనే రోళ్లవాగు ఆధునీకరణ

జిల్లా మాజీ చైర్ పర్సన్ దావ వసంత


రోళ్లవాగును పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

బీర్‌పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత కృషితోనే రోళ్లవాగు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంతో పాటు ధర్మపురి నియోజకవర్గ రైతులకు కవిత అండగా నిలిచిందన్నారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో సాగు, తాగు నీటికి ఇబ్బంది పడుతున్న రైతులకు రోళ్లవాగు ప్రాజెక్టుతో కవితక్క రైతులకు వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. 99 శాతం ప్రాజెక్టు పనులను కేసీఆర్ నాయకత్వంలో కవిత ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. ఒక్క షట్టర్ లేక ఇబ్బంది పడుతున్న తమకు ఈ రోజు కవిత ఉండి ఉంటే తమ సమస్యలు తీర్చేదని రైతులు బాధపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ పాక్స్ చైర్మన్ మెరుగు రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లల విడుదల

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని చెరువుల్లో బుధవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మత్స్యకార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, డీఎఫ్‌వో సౌజన్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శంకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరి శంకర్, నాయకులు ఉన్నారు

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాల, మాలల ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి మాల మాలల ఉపకులాల జిల్లా చైర్మన్ రాగుల రాములు అన్నా రు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న సిరిసిల్ల పట్టణంలో మాల మాల ఉపకులాల ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంటస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు.

కాళోజీకి ఘన నివాళి

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణం న్యూ అర్బన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో కాళోజి 23వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉద్యమం ఊపిరిగా కాళోజి జీవించారని గుర్తు చేశారు.

సర్కారు కొలువే లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

ఇటీవల డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించిన సర్కారు జాబ్ క్యాలెండర్‌ను అనుసరిస్తూ మరోసారి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ ద్వారా ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ రావడంతో నిరుద్యోగులు మళ్లీ ప్రిపరేషన్ షురూ చేశారు. ఈ ఏడాది మే నుంచి 20వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు టెట్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, ఇచ్చిన మాట ప్రకారం రెండోసారి నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీ వరకు టెట్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 తేదీ నుంచి 20 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

జిల్లాలో 30 వేల మంది నిరుద్యోగులు

జిల్లాలో పీఎస్, గౌట్ హెచ్‌ఎం, ల్యాంగ్వేజ్ పండిట్, సీనియర్ అసిస్టెంట్ (ఆయా కేటగిరీలు), ఎస్టీటీ తదితర వాటికి సంబంధించి పలు ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. జిల్లా నుంచి 25 వేల నుంచి 30 వేల మంది వరకు నిరుద్యోగులు టెట్ రాసేందుకు ప్రిపేర్ అవుతున్నారు. టెట్ పేపర్-1 డీఈడీ, పేపర్-2 కు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాలంటే టెట్ తప్పనిసరి కావడంతో వందలాది మంది ఉపాధ్యా యులు పరీక్షకు సిద్ధమవుతున్నాయి. టెట్ విధానం అమలులోకి వచ్చిన నాటి నుంచి 9 సార్లు ఎంట్రెన్స్ టెస్ట్‌లు జరుగగా, వచ్చే ఏడాది జనవరిలో 10వ సారి జరుగబోతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆరుసార్లు టెట్ పరీక్షలు జరిగాయి. ఇప్పుడు జరగబోయే టెట్‌పై నోటిఫికేషన్ రావడంతోనే కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు నిరుద్యోగులకు ఫోన్లు చేసి కోచింగ్ సెంటర్‌లో చేరాలని కోరుతున్నారు.

నీట్‌కు ప్రిపేర్ అవుతున్నాను..

మూగల మౌని శ్రీ, యువతి, జగిత్యాల



నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాను. రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు లైబ్రరీకి వచ్చి చదువుకుంటున్నాను. ఎలాంటి డిస్టపెన్స్ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో లైబ్రరీ ఉండడం సన్నద్ధమవుతున్నాను. పరీక్షకు అవసరమైన పలు పుస్తకాలు అందుబా టులో ఉన్నాయి. అనుమానాలు వస్తే ఒకరికొకరం తీర్చుకుంటున్నాము.

ఒత్తిడి లేకుండా సన్నద్ధం కావాలి

డాక్టర్ సాకేత్ రెడ్డి, ప్రభుత్వ మానసిక వైద్య నిపుణులు, జగిత్యాల



పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతీ యువకులు మానసిక ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రిపేర్ కావాలి. పరీక్షకు అవసరమైన మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. అనుమానాలు వస్తే నిపుణులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ఏకాగ్రత, నిరంతర శ్రమ, క్రమశిక్షణ, సమయ పాలన పాటిస్తే లక్ష్యం సాధించవచ్చును.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

సారంగాపూర్, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బట్టపెల్లి గ్రామానికి చెందిన కల్లెపెల్లి రమాదేవి వెన్నుముక సంబంధిత సమస్యతో బాధపడుతుంటంతో స్థానిక నాయకులు సమస్యను ఎమ్మెల్యే డాక్టరు సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ, 2.50 వేల ఎల్‌వోసిని కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోళ్లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడవద్దు

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

కథలాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని సిరికొండ, కథలాపూర్, బొమ్మెన, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లోని ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 17 శాతం తేమ చూసి తూకాలు వేయాలని రవాణా, డాటా ఎంట్రీ వంటి అంశాలను పకడ్బందీగా చూసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన కొనుగోలు, రవాణా జరిగిన వివరాలను కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, ఆర్‌ఐ నగేశ్, ఏపీఎం నరహరి, సీసీలు విజయలక్ష్మీ, అశోక్, రాజేందర్, అంజయ్య, వీపీఓలు, విండో సీఈవో రాంప్రసాద్ ఉన్నారు.


బొమ్మెనలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ ఇబ్బందులే

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్ని ఇబ్బందులేనని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకలతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పాదయాత్రలో రైతులు కలిసి ఎన్నో సమస్యలు వివరించి మద్దతు పలికారని అన్నారు. పాదయాత్ర విజయం రైతులదేనని అన్నారు. జిల్లాలో గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం 4 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనులు జరిపితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 క్వింటాల్ల వరి దాన్యం కొనుగోలు చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ నాయకుడు ఫహీం, అన్వర్, అస్లాం, పోట్ల సురేందర్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్ : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకారం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని ప్రకటించిన బోనస్‌తో పాటు రైతు బంధు అర్హులైన రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

వృద్ధాశ్రమం ఏర్పాటు అభినందనీయం


వృద్ధాశ్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సత్యం, సంజయ్, ఎమ్మెల్సీ వెంకట్

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జగిత్యాల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీ సరస్వతి ఆలయ సమీపంలో గండ్ర రాధ-రాఘవేందర్‌రావుల ప్రశాంత నిలయం (వృద్ధాశ్రమం)ను జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి ఎమ్మెల్యే సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాశ్రమం నిర్మాణానికి హైకోర్టు అడ్వకేట్ గండ్ర మోహన్‌రావు రూ.50 లక్షలు విరాళం అందించడం, మోహన్‌రావు తల్లిదండ్రుల సేవాతత్పరత ఈ ప్రాంత వాసులకు గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ వెలమ సంఘం, వృద్ధాశ్రమం అభివృద్ధికి పాటు పడతానన్నారు. నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, వికాష్‌రావు, జువ్వాడి కృష్ణారావు, హైకోర్టు అడ్వకేట్ గండ్ర మోహన్‌రావు, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, ఆనందరావు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి

వెల్గటూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెల్గటూర్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ సూచించారు. బుధవారం కిషన్‌రావుపేటలో విద్యుత్ ప్రమాదాలు నివారిద్దాం-నాణ్యమైన సేవలు అందిద్దాం అనే నినాదంతో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా గ్రామాలలో రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రమాదల నివారణకు రైతులు విధిగా మోటార్లకు స్టార్టర్లకు ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సత్యనారాయ ణరావు, కుమ్మరి వెంకటేష్, రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వెంకట్ కుటుంబ సభ్యులపై ఆరోపణలు

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆయన కుటుంబసభ్యులపై ఆయన సొంతూరు మల్యాల మండలం మానాలకు చెందిన ఓ కుటుంబం భూవివాదంపై ఆరోపణలు చేయడం సోషల్‌మీడియాలో చర్చనీయంశంగా మారింది. 30 ఏళ్ల కిందట సుమారు మూడు ఎకరాల భూమిని అమ్మి రిజిస్ట్రేషన్ చేయలేదని అడిగితే బెదిరించే వీడియోలు వైరల్ అయ్యాయి.

108 అంబులెన్స్‌లో ప్రసవం

గొల్లపెల్లి, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) గొల్లపెల్లి మండలం రాపల్లె గ్రామానికి చెం దిన కర్రె దివ్య పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో దివ్యను జగిత్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు తీవ్రతరం కావడంతో అంబులెన్స్‌లోనే ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి అనిల్, పైలెట్ కిషన్ దివ్యకు పురుడు పోశారు. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

కొలుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని అయిలాపూర్, ధర్మారం గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలలో నిలువ ఉన్న ధాన్యం రికార్డు వివరాలను తెలుసుకున్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం నిలువలను చూసి తేమను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందు కలుకుండా చూడాలని సూచించారు. తేమ శాతాన్ని ఎప్పడికప్పుడు పరిశీలించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్‌డీవో జివాకర్ రెడ్డి, తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి

పెగడపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలని జగిత్యాల ఆర్డీవో మదుసూదన్ పేర్కొన్నారు. మండలంలోని పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాంనగర్, పెగడపల్లి కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆర్డీవో సందర్శించి ధాన్యం నిల్వలు, కొనుగోలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని, కేం ద్రాలలో రైతులకు కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి. రవీందర్, విండో సీఈవో గోపాల్ రెడ్డి ఉన్నారు.


కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

'రైతులను ఎమ్మెల్యే తప్పుదోవ పట్టిస్తున్నాడు'

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ఎమ్మె ల్యే డాక్టర్ సంజయ్ పాదయాత్రలు చేసిన రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని, అతని పాద యాత్ర నమ్మే పరిస్థితుల్లో రైతులు లేరని కాంగ్రెస్ సీని యర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ముందు చూపు లేకుండా లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసాడన్నారు. ముత్యంపేట చక్కర ఫ్యాక్టరీని మూసి వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కు తుందన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఎంబేరీ నాగ భూషణం నాయకులు పుప్పాల ప్రభాకర్, బెజ్జారపు శ్రీనివాస్, సత్యనారాయ ణగౌడ్, కొంత రాజం, తిరుమల గంగాధర్, సోగ్రబీ, సంగ లింగం, మహిపాల్‌రెడ్డి, వసీం, రంజిత్, అగ్బర్ పాల్గొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యేను కలిసిన జిల్లా వైద్యాధికారి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను బుధవారం జిల్లా వైద్యాధికారి ప్రమోదు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి శ్రీని వాస్ మర్యాద పూర్వకంగా కలిసారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్‌ను కలిసి పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

●జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

●నాచుపల్లి జేఎన్‌టీయులో ఘనంగా ఫ్రెషర్స్ డే


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్

కొడిమ్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాల ని జేఎన్‌టీయుహెచ్ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కె. వేంకటేశ్వర రావు అన్నారు. బుధవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలు, సందేహాలు ఏమైనా ఉంటే ఆచార్యులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదువుతూ నమ్మకంతో ఉండి ఉన్నతంగా ఎదగాలని కోరారు. విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా కళాశాల పని చేస్తుందన్నారు. అంతక ముందు గౌరవ అతిథి జేఎన్‌టీయూహెచ్ బిక్స్ డైరెక్టర్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో నాచుపల్లి కళాశాలలో విద్యార్థులు సెంట్రిక్ విధానాన్ని అవలంబిస్తున్నారని తెలిపారు. ప్రారంభోపన్యాసంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులు కొత్త జీవితంలోకి ప్రవేశించారన్నారు. వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేష్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలోని 170 మంది విద్యార్థులకు బుధవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. 14 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. 11 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల వీసీసీ నిఖిల్ బృందం పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లావణ్య, విజన్ టెక్నీషియన్ ఎస్. శృతి, ఎస్. అంకిత పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలో గల విద్యాశాఖలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలిపై వస్తున్న పలురకాల ఆరోపణలపై బుధవారం బాలికల వసతి గృహానికి వెళ్లి ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. కొంతమంది ఉపాధ్యారాయులిపై పలురకాల ఆరోపణలు చేయడంతో ఈ మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవ స్థానంలో మంగళవారం రాత్రి ఇస్కాన్ మెట్‌పల్లి శ్రీరాధా గోవర్ధన దారి మందిరం వారి సౌజన్యంతో కార్తీక దామోదర దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు భక్తులు మండల కేంద్రంలో నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు.

పెగడపల్లి : సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా ప్రతి ఇంటికెళ్లి సర్వే నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం పెగడపల్లి మండలంలోని దోమలకుంటలో ఇంటింటి సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో కలసి మనోహర్ పరిశీలించారు.

కోనరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలని కొలనూరు సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేష్ అన్నారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో బుధవారం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు బాదనేని దేవయ్య, ప్రవీణ్, వినోద, మొగిలిపాల మల్లయ్య, ఉప్పుల నాగరాజు, శ్రీకాంత్, చంద్రయ్య, మధు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్ : సిరిసిల్లలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వ హిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మ న్ నాగుల సత్యనారాయణగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.